క్లుప్తంగా

పోలీస్ వెల్ఫేర్ డే స్పందనలో 31 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమాన్ని కాంక్షిస్తూ జరిగిన స్పందనలో 31 ఫిర్యాదులు అందినట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. విజయవాడలోని జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది నుంచి శుక్రవారం ఫిర్యాదులు స్వీకరించారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని సీపీ రాణా అన్నారు.

రమణ మహర్షి బోధనలు అనుసరణీయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రమణ మహర్షి బోధనలు అనుసరణీయమని ఆధ్యాత్మిక ప్రసంగీకుడు బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వరశర్మ అన్నారు. రమణ మహర్షి సేవా సంస్థ ఆధ్వర్యంలో రమణుల జయంతి ఉత్సవాన్ని పాతబస్తీలోని కుసుమహరనాథ మందిరంలో వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసంగం జరిగింది. రమణులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. రెండు రోజుల పాటు విశేష జ్యోతులు వెలిగించి పూజలు కొనసాగించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కోటేశ్వరరావు, రామకృష్ణ, మార్నెళ్ల శ్రీనివాసు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం కూడా పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు నగరవాసులు కట్టాల్సిన పన్నులను ఆదివారం కూడా చెల్లించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను, తాగునీరు, డ్రైనేజీ పన్నులను డిసెంబర్ 31, 2023 లోపు చెల్లించాలని, ఈ మేరకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న పన్ను చెల్లింపు క్యాష్ కౌంటర్లు ఆదివారం కూడా పని చేస్తాయని వివరించారు. ఆయా ప్రాంతాల్లో క్యాష్ కౌంటర్లు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ మండపంలో నేషనల్ ఎక్స్‌పో ప్రారంభమైంది. శుక్రవారం నుంచి జనవరి 3వ తేదీ వరకు జరిగే ఎక్స్‌పోలో వివాహాది శుభకార్యాలకు భారతీయ సంప్రదాయ దుస్తుల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

దీనిలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మగ్గాలపై నేసిన ఎన్నో రకాల ఉత్పత్తులు ఉంటాయన్నారు. ప్రధానంగా నేత కార్మికులు తాము ఉత్పత్తి చేసిన సిల్క్ కాటన్ వస్త్రాలపై 40 శాతం తగ్గింపుతో విక్రయిస్తున్నామని, డిజైనర్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తాలపై ప్రత్యేక తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

క్యాన్సర్ సోకిన 13 ఏళ్ల బాలుడికి అరుదైన చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): శరీరంలోని మృదు కణజాలాల్లో సోకే రాబ్డోమియా సార్కోమా (ఆర్‌ఎంఎస్)తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడికి విజయవతంగా చికిత్స చేసినట్లు కానూరులోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు తెలిపారు. విజయవాడకు చెందిన 13 ఏళ్ల బాలునికి మార్చి 2022 నుంచి ఎడమ కంటిలోపలి భాగంలో కంటి కాంతస్ (కనురెప్పల చివరిభాగం) వద్ద నొప్పిలేకుండా ఉన్న కణితి వచ్చింది.

అది క్యాన్సర్ గడ్డగా నిర్ధారించడంతో చికిత్స నిమిత్తం తమ ఆస్పత్రికి వచ్చినట్లు డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. నిపుణుల సంరక్షణలో కీమోథెరపీ, రేడియోథెరపీతో కూడిన సమగ్ర చికిత్సను విజయవంతంగా అందించినట్లు తెలిపారు. రోగి వయస్సు 13 ఏళ్లు కావడంతో అత్యంత నైపుణ్యంతో కూడిన చికిత్స చేసి మెరుగైన ఫలితం సాధించినట్లు చెప్పారు. ఆర్‌ఎంఎస్ అనేది క్యాన్సర్ అరుదైన రూపంగా పేర్కొన్నారు. ఇది మృదుకణజాలాల్లో, ముఖ్యంగా పక్కటెముకల కండరాల్లో, కొన్నిసార్లు మూత్రాశయం, గర్భాశయం వంటి బోలు అవయవాల్లో కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు తెలిపారు.

శరవేగంగా అభివృద్ధి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు అభివృద్ధి చేశామన్నారు. మిగిలిన పనులకు శంకుస్థాపన చేసుకుంటున్నామన్నారు. భవానీపురం 41వ డివిజన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి విస్తృతంగా పర్యటించారు. డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. డివిజన్‌లో తిరిగి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నిత్యం డివిజన్లతో పర్యటిస్తూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. ముస్లిం బరియల్ గ్రౌండ్ అభివృద్ధి చేశామని చెప్పారు. దర్గా బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. క్రైస్తవ శ్మశాన వాటిను కూడా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. వర్షం నీటితో మునిగిపోయే ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించి సమస్య లేకుండా చేశామన్నారు.

పవన్ కల్యాణ్ అజ్ఞాని

పవన్ కల్యాణ్ ఒక అజ్ఞాని అని వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఆయన ఫామ్ హౌస్ వదిలి రోడ్డు మీదకు వచ్చి రాష్ట్రంలో జరిగే అభివృద్ధిని చూడాలని హితవు పలికారు. గతంలో పవన్ కల్యాణ్ దత్త తండ్రితో కలిసి పరిపాలన చేసినపుడు ఏం అభివృద్ధి చేశారో.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏం జరిగిందో చర్చకు రావాలని అనేకసార్లు సవాల్ విసిరామని తెలిపారు. మళ్లీ అదే మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ ఎవరు చర్చకు వస్తారో చెప్పాలన్నారు. అభివృద్ధి జరగలేదని అసత్యాలు మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుంటుందన్నారు. పర్యటనలో కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, ఆంజనేయ రెడ్డి, కోటిరెడ్డి, నాయకులు రెహమాన్, ఇషాక్, లాజర్, జోసఫ్, ఆనంద్, బాబు, రసూల్ ఖాన్, గౌస్ పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



చద్దర్‌ను సమర్పించేందుకు తీసుకెళ్తున్న ఎస్‌కే నజీర్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మైనార్టీ నేతలు ప్రార్థించారు. విద్యాధరపురం 38వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ నజీర్ అజ్మీర్ షరీఫ్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో చద్దర్ సమర్పించారు. నజీర్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని సుమారు 50 మంది వైఎస్సార్ సీపీ మైనార్టీ కార్యకర్తలు అజ్మీర్‌లోని దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లోకూడా ఘనవిజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డే ఏపీకి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అల్లాను ప్రార్థిస్తూ చద్దర్‌ను సమర్పించామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని ప్రార్థనలు చేశామని వివరించారు. దర్గాను సందర్శించినవారిలో సలీం, ఫారూఖ్, ఆరిఫ్, షఫీ, నూర్జహాన్ ఉన్నారు.

నేడు పుస్తక మహోత్సవంలో కార్యక్రమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం 6.00 గంటలకు విశాలాంధ్ర పబ్లిషర్స్ వారి పుస్తకావిష్కరణ సభ జరుగుతుంది. 'జనాభా సంఖ్య- అపోహలు - భారత రాజకీయాలు' పుస్తకాన్ని భారత మాజీ ప్రధాన ఎన్నికల అధికారి వైఎస్ ఖురేషి ఆవిష్కరిస్తారు. ముఖ్యఅతిథులుగా మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్, బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా, మాజీ ఎమ్మెల్యే, విశాలాంధ్ర సంపాదకమండలి అధ్యక్షుడు కె.రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకమండలి అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకుడు గడ్డం కోటేశ్వరరావు తదితరులు పాల్గొంటారు. శ్రీరమణ ప్రతిభా వేదికపై సాయంత్రం 5 నుంచి 8గంటల వరకూ సైన్స్ ప్రయోగాలను విద్యార్థుల అవగాహన కోసం ప్రదర్శిస్తారు.

వేంపల్లె పుస్తకావిష్కరణ..

శనివారం సాయంత్రం ఐదు గంటలకు సీనియర్ జర్నలిస్టు, కథా రచయిత డాక్టర్ వేంపల్లె షరీఫ్ రాసిన 'టీవీ ప్రకటనల్లో భాషా సంస్కృతులు' పుస్తకం ఆవిష్కరణ జరగనుంది. షరీఫ్ మీడియాతో మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ఎక్కడ చూసినా విజృంభిస్తున్న ప్రకటనల వెనుక వేల కోట్లాది రూపాయల వ్యాపారం ఉందని దాని కోసం అవి మన మీద ఎలాంటి భాషని, సంస్కృతిని రుద్దుతాయో తాను ఈ పుస్తకంలో వివరించానన్నారు. ఆవిష్కరణకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య టి.హేమచంద్రారెడ్డి, అధికార భాషా సంఘం సభ్యులు పి.విజయబాబు, సాహితీ విమర్శకులు చినుకు రాజగోపాల్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి

విజయవాడ స్పోర్ట్స్: రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి ఏలూరు రోడ్డులోని వ్యాపారస్తులను హెచ్చరించారు. జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు ఏలూరు రోడ్డులోని వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులతో శుక్రవారం వ్యాస్ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో డీసీపీ సమావేశమయ్యారు. ఏలూరు రోడ్డులోని ట్రాఫిక్ సమస్యను పూర్తిగా పరిశీలించానని, రోడ్డుకు రెండువైపులా వ్యాపారులు విక్రయాల నిమిత్తం వస్తువులను ఉంచుతున్నట్లు గుర్తించానన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాప్‌లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏడీసీపీ ప్రసాద్, ఏసీపీలు రామచంద్రరావు, శ్రీనివాసరావు, సీఐ మహేంద్ర పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఆటోడ్రైవర్



నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన ఆటోలో మరిచిపోయిన సుమారు రూ. 8లక్షల విలువైన బంగారు ఆభరణాలను ఆటో డ్రైవర్ పోలవరపు నాగేశ్వరరావు తిరిగి అప్పగించి నిజాయతీని చాటుకున్నారు. వారం క్రితం తన ఫ్రెండు పెళ్లికి వెళ్లిన సందర్భంగా చేవూరి నవీన ఆటోలో కూర్చుని బిడ్డకు పాలిస్తూ ఆటోలో 8 తులాల బంగారం మర్చిపోయింది.

ఆ బంగారాన్ని డ్రైవర్ నాగేశ్వరరావు నవీన కుటుంబానికి అందజేశారు. దాని విలువ రూ. 8లక్షల ఉంటుందని వారు తెలిపారు. నాగేశ్వరావుకు కతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం రైల్వే స్టేషన్ పార్సిల్ ఆఫీస్ గేట్ వద్ద నవీన అన్న చేవూరి సాగర్ ఆటో డ్రైవర్ నాగేశ్వరరావు రూ. 10 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్ బాబురావు నాగేశ్వరరావుకు శాలువా కప్పి పూలదండ వేసి పుష్పగుచ్ఛంతో అభినందించారు.

సలీం బహిష్కరణ పొడిగింపు

విజయవాడ స్పోర్ట్స్: టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టినగర్‌కు చెందిన షేక్ సలీం నేర ప్రవృత్తిలో మార్పు రాకపోవడంతో అతని నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక కేసుల్లో నిందితుడుగా ఉన్న సలీం పలుమార్లు జైలు జీవితం అనుభవించాడని, ఆ తరువాత అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. ప్రస్తుతం బహిష్కరణలో ఉన్న సలీం జీవన శైలిలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు.

హక్కులపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది సాంబశివరావు

మైలవరం: విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలని మైలవరం జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాది పీవీ సాంబశివరావు తెలిపారు. స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 219ను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. నేటి సమాజంలో వస్తు సేవలను విక్రయించేటపుడు వస్తు సేవలపై సమగ్ర పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఎటువంటి దోపిడీకి గురికాకుండా వినియోగదారులు మేల్కోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ వినియోగదారులు వస్తువుల నాణ్యత, నకిలీ వస్తువులను గుర్తించే అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కామర్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఎం. శ్రీనివాసరావు, సీనియర్ ఫాకల్టీ ఫణికుమార్, కరిముల్లా, నారాయణరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ భవానీపురం ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మంగళగిరి పరాంకుశం వీధి (ఎంపీ దాస్ వీధి), ఆకుల రాజేశ్వరరావు మిల్లురోడ్, చెట్లబజార్ వరకు కరెంట్ నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

పుస్తక ప్రియుల ఉత్సవం



నగరంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న పుస్తక మహోత్సవ ఆవరణ శుక్రవారం పుస్తక ప్రియులతో నిండిపోయింది. ఆధ్యాత్మిక, మానసిక వికాసం, ఇతిహాసం, సమయం సద్వినియోగం తదితర పుస్తకాలను పిన్న, పెద్ద కొనుగోలు చేశారు. ఆ ప్రాంగణంలో పలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకే ..



ఆడుదాం ఆంధ్రా పోటీలపై ప్రద్యుమ్నకు వివరిస్తున్న స్వప్నిల్ దినకర్ వుండ్కర్



క్రికెట్ ఆడుతున్న వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని చేపట్టారని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యాధరపురంలో నిర్మాణంలో ఉన్న స్టేడియంలో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను శుక్రవారం వెలంపల్లి శ్రీనివాసరావు, యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చరల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్, డీఎస్‌ఓ అజీజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో స్టేడియం నిర్మించాలన్నది క్రీడాకారుల చిరకాల కోరిక అన్నారు. వారి కోరికను సాకారం చేస్తూ స్టేడియం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. అనంతరం ఆయన కొద్దిసేపు క్రీడాకారులతో క్రికెట్ ఆడి వారిని ప్రోత్సహిస్తూ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చరల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న ఆడదాం ఆంధ్ర పోటీల నిర్వహణను పరిశీలించారు. ఎన్ని మ్యాచ్‌లు జరగాలి..ఎన్ని మ్యాచ్‌లు జరిగాయి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 'ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణ తీరును మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ పరిశీలించి పోటీలు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయా లేదా, సిబ్బంది క్రీడాకారులను పర్యవేక్షిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అదితిసింగ్, వీఎంసీ అడిషనల్ కమిషనర్లు కె.శకుంతల, కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరన్ రాయ్, ఈఈ నారాయణమూర్తి, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, సచివాలయ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకు సంక్షేమం



ఇంటింటికీ వెళ్ల కరపత్రాలు అందించి వివరిస్తున్న దేరంగుల రమణ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని నేతలు అన్నారు. స్థానిక 47వ డివిజన్ 147వ సచివాలయం పరిధిలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ డివిజ నేతలు దేరంగుల వెంకట రమణ, ఇలిపిల్ల విజయలక్ష్మి, ఈపూరి లక్ష్మి, భోగి సుజాత తదితరులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు పాలనలోని టీడీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పారదర్శక పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ఈ సందర్భంగా దేరంగుల వెంకట రమణ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కావాలా..జన్మభూమి కమిటీల పేరుతో అందినకాడికి దోచుకునే దళారులు కావాలో ఆలోచించుకోవాలని కోరారు. ఒక్క జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు మూకుమ్మడిగా ఆయనమీద, ప్రభుత్వంపైనా బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారంటే జగనన్న బలం ఏమిటో అర్థమవుతుందన్నారు. సీఎం జగనన్న రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఇతర రాష్ట్రాలు స్ఫూర్తి పొందాయని తెలిపారు.

కమ్యూనిటీ హాల్ శ్లాబ్ పనులు ప్రారంభం



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్లాబ్ పనులు ప్రారంభించిన రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 38వ డివిజన్ పరిధిలోని మల్లికార్జునపేటలో జరుగుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో భాగంగా శ్లాబ్ వేసే పనులకు స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా శుక్రవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పునాదులు తీసి వదిలేశారని గుర్తు చేశారు. కమ్యూనిటీ హాల్ లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.36 లక్షలు నిధులు మంజూరు చేయించారని చెప్పారు. వాటితో శ్లాబ్ ఏర్పాటు పనులను మొదలు పెట్టామని పేర్కొన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణ పనులు పూర్తికాగానే పైన రేకుల షెడ్‌కూడా నిర్మించనున్నామని తెలిపారు. మల్లికార్జునపేటవాసుల కమ్యూనిటీ హాల్ కోరిక ఎట్టకేలకు తీరనుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, డి.రామ్‌ప్రసాద్, ఎస్.రాంబాబు, రమేష్, అడ్డగర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై రద్దీ సాధారణం



దుర్గగుడిలో క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న ఆలయ ఏఈవో

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం రద్దీ సాధారణంగా కనిపించింది. ఉదయం 6 గంటల నుంచి ఓ మోస్తరుగా ఉన్న రద్దీ మధ్యాహ్నం కాస్త పెరిగింది. అమ్మవారికి మహా నివేదన సమర్పించడానికి అరగంట అన్ని దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎస్.రమేష్‌బాబులు క్యూలైన్లను పర్యవేక్షించారు.

నేడు కానుకల లెక్కింపు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్లకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, మొక్కుబడులను శనివారం లెక్కించనున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో కానుకలు లెక్కించనున్నారు.

ఏపీపీడీఈఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్(ఏపీపీడీఈఏ) 2024 టెక్నికల్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం విద్యుత్ సౌధలో జరిగింది. విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ డైరీని ఆవిష్కరించారు. జేఎండీ (విజిలెన్స్) మల్లారెడ్డి టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి. శేషారెడ్డి మాట్లాడుతూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న విజయానంద్, మల్లారెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ సంస్థల పరిరక్షణకు సభ్యులు పని చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమానికి డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.మహేశ్వరరెడ్డి, రాష్ట్ర ముఖ్య సలహాదారు ఎ.సుబ్బారావు, కార్య నిర్వాహక అధ్యక్షులు హుస్సేన్ ఖాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● ఆత్మీయ సమ్మేళనం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో జనవరి 7వ తేదీన పూర్వ విద్యార్థులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీఎల్ ప్రసాద్, ఎస్‌బీఎం మురళీకృష్ణ తెలిపారు. కళాశాలలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు, అధ్యాపకులను భాగస్వాములు చేసేందుకు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.